కథ

# అందరివాడు

పినిశెట్టి శ్రీనివాసరావు

"అమ్మగారూ–వెళ్ళొస్తానండి. మళ్ళీ సోమవారమేనండి పన్లోకి రావటం" అంది పనమ్మాయి ఈశ్వరి.

"తప్పకుండా వచ్చేస్తావుగా... ఇంకా లేటు చేయకు. ఇప్పటికే మూడు రోజులు పని మానేస్తున్నావ్" అంది మా మేడమ్ – అదే మా హోం మినిస్టర్.

"ఎందుకు రానండి.. సోమవారం తెల్లారేసరికి బండి దిగేస్తాం కదండీ.. పదో గంటకల్లా పన్లో కొచ్చేస్తానండీ" అంది ఈశ్వరి.



Story

''అలాగే అంటావ్.... తర్వాత పన్లోకి రానందుకు ఏదో ఒక కారణం చెప్తావ్'' అంది మేడమ్.


''తిరుపతి మొక్కు తీర్చుకోటానికి కదండీ వెళ్ళేది. లేకపోతే మూడు రోజులు పని మానేస్తానటండీ'' అంది ఈశ్వరి.

వాళ్ళ సంభాషణ వింటున్న నేను ఓ వంద నోటు తీసి... ''తిరుపతి వెళ్తున్నానంటుందిగా... ఖర్చులకుంటాయ్ ఇచ్చేయ్'' అని మా మేడమ్ చేతిలో పెట్టాను.

అయిష్టంగానే ఈశ్వరి చేతిలో వంద నోటు పెట్టింది మేడమ్.

ఊహించని సహాయానికి ఈశ్వరి కళ్ళల్లో కృతజ్ఞతాభావం.

''ఏదో వంక చెప్పి, పని మానేస్తుంటారు ఈ పనోళ్ళు. అయినా వీళ్ళకి ఈ మొక్కులు... దానికి బోలెడు ఖర్చులు దేనికి చెప్పండి. అంతగా అయితే దగ్గర్లో వున్న ఏ చిన్న తిరుపతికో వెళ్ళి రావాలి కాని... అంత దూరం ఎంత ఖర్చని... ఇంక వచ్చిన దగ్గర్నుంచి... అమ్మగోరూ ఓ ఐదొందలు అడ్వాన్సు ఇప్పించండి... వచ్చే నెల ఇరుపుకొందురుగాని... అంటూ బేరాలు. అయినా మీరేంటి... అయిన దానికి కానిదానికి దానధర్మాలు చేసేస్తుంటారు. మనకీ బోలెడు ఖర్చులుంటాయి... ఉన్నదంతా దులిపేసుకుంటే ఇంతే సంగతులు... కొంచెం బుర్రుపయోగించండి'' అంటూ పని మనిషిమీద కోపంతో నన్ను కూడా కలిపి నా డైలీకోటా ఇచ్చేసింది మేడమ్.



''ఎం.పిగారు మా వారికి కజినే కదా! ఇంకో 'కజిన్' ఎం.ఎల్.ఏ. ఎవరో ఒకరు లెటర్ ఇచేస్తుంటారు. సంవత్సరంలో కనీసం రెండు సార్లైనా కంపల్సరీగా తిరుపతి వెళ్ళొస్తుంటాం. ముందుగా ఏం అనుకోం. ఎప్పుడు వెళ్ళాలనిపిస్తే అప్పుడు బయలుదేరిపోతాం. కాటేజి రిజర్వేషన్లు, విఐపి దర్శనాలు, అన్నీ ఇలా అనుకుంటే అలా జరిగిపోతాయి. స్వామి వారి కళ్యాణం ఇప్పటికి ఎన్నిసార్లు చేయించామో లెక్కలేదు'' ఉన్న వాళ్ళకి ఆ గోవిందుడు ఎంత అందుబాటులో వుంటాడో సుబ్బలక్ష్మిగారి మాటల్లో వ్యక్తమవుతోంది.

మనకిది మామూలే కనుక పెద్దగా పట్టించుకోనవ సరం లేదు.

***

ఆ రోజు మధ్యాహ్నం మా ఫ్లాట్‌లోనే మా గ్రూప్ హౌస్ లేడీస్ మీట్ జరిగింది. పెంట్‌హౌస్ 'వీర్రాణి' గారు, సెకండ్ ఫ్లోర్ సుబ్బలక్ష్మిగారు, ఫస్ట్ ఫ్లోర్ సుకుమారిగారు, థర్డ్ ఫ్లోర్ మా మేడమ్ గారు రొటీన్ అజెండా అయిపోయిన తర్వాత, ఈశ్వరి తిరుపతి యాత్ర చర్చకు వచ్చినప్పుడు... తిరుపతి వెంకన్న దగ్గర ఎవరెవరికి ఎంతెంత పరపతి వుందో పోటీలు పడి చెప్పేసుకున్నారు.

''మేము ఎప్పుడు తిరుపతికి వెళ్ళినా, మినిస్టరు గారు లెటరు ఇచ్చేస్తారు. కాటేజీలు, బ్రేక్ దర్శనాలు, ఆర్జితసేవలు, ఏది కావాలంటే అది అప్పటికప్పుడు ఏర్పాటుచేస్తారు. కనీసం మూడు దర్శనాలైనా చేసుకుంటాము వెళ్ళిన ప్రతిసారి... ఇక లడ్డూలైతే... ఎన్ని తెస్తామో లెక్కేలేదు'' అంటూ వీర్రాణిగారు ముందుగా లార్డు (లడ్డు) వెంకన్న దగ్గర తమకున్న పరపతి గురించి చెప్పేశారు.

''ఎం.పిగారు మా వారికి కజినే కదా! ఇంకో 'కజిన్' ఎం.ఎల్.ఏ. ఎవరో ఒకరు లెటర్ ఇచ్చేస్తుంటారు. సంవత్సరంలో కనీసం రెండు సార్లైనా కంపల్సరీగా తిరుపతి వెళ్ళొస్తుంటాం. ముందుగా ఏం అనుకోం. ఎప్పుడు వెళ్ళాలనిపిస్తే అప్పుడు బయలుదేరిపోతాం. కాటేజి రిజర్వేషన్లు, విఐపి దర్శనాలు, అన్నీ ఇలా అనుకుంటే అలా జరిగిపోతాయి. స్వామి వారి కళ్యాణం ఇప్పటికి ఎన్నిసార్లు చేయించామో లెక్కలేదు'' ఉన్న వాళ్ళకి ఆ గోవిందుడు ఎంత అందుబాటులో వుంటాడో సుబ్బలక్ష్మిగారి మాటల్లో వ్యక్తమవుతోంది.

''ఆలయ ప్రధాన అర్చకులు మా పిన తండ్రిగారికి స్వయాన వియ్యంకుడు. మేము తిరుపతి ఎప్పుడు వెళ్ళినా, వాళ్ళింట్లోనే విడిది. అన్నీ ఆయనే చూసుకుంటారు. మేము ఎప్పుడు వెళ్ళినా, వి.ఐ.పి. దర్శనాల్తో మమ్మల్ని కలిపేస్తారు. దేవుడ్ని దగ్గర్నుండి కనీసం పది, పదిహేను నిమిషాలైనా చూడకుండా రాము ఎప్పుడు వెళ్ళినా. ఇక ప్రసాదాలు ఎంత కావాలంటే అంత'' సుకుమారిగారి పరపతి ఇది. దేవుడు వరమిచ్చినా, పూజారి వరమివ్వకపోవచ్చేమో కాని, పూజారి వరమిచ్చాక దేవుడు కాదనేదేముంది? కాదంటే, నిత్యపూజలు - నైవేద్యాలు ఇంతే మరి.

''తిరుపతిలో మా వారి డిపార్టుమెంటు వాళ్ళే అన్నీ చూసుకుంటారు. అయినా, మేము మీ అందరంత తరచూ తిరుపతి వెళ్ళం. ఏ రెండు మూడేళ్ళకో ఒక్కసారి అంతే... మా వారికి ఆ జనంలో గుళ్ళకి వెళ్ళటం నచ్చదు. గుడికి ప్రశాంత వాతావరణంలో వెళ్ళాలంటారు'' అంటూ ఆఖరుగా మా మేడమ్ తిరుపతి యాత్రలో మా చిన్న పరపతి వివరించింది.

మొత్తానికి మా పనమ్మాయి పుణ్యమా అని, అందరూ ఆ వడ్డికాసుల వాడ్ని తలచుకోవటం, నాకు నచ్చింది. ఎందుకంటే రొటీన్ అంశాలైన, టీవీ సీరియల్స్ సినిమాలు, చీరలు, బంగారం, వంటలు వగైరా వగైరాలు ప్రక్కన పెట్టి, గొప్పలు చెప్పుకున్నా, భగవంతుడ్ని తలచుకున్నందుకు.

నాకు అప్పుడప్పుడు అనిపిస్తుంటుంది. అసలు ఈ గోవిందయ్య కుబేరయ్య దగ్గర తీసుకున్న అప్పెంత? దానికైన వడ్డీ ఎంత? ఇప్పటికి తీర్చిందెంత? దీనికంతా అకౌంట్ చూసేదెవ్వరు? ఆడిటర్లెవరు? వడ్డీరేటెంత? ఎప్పటికప్పుడు అజ్ఞాతభక్తులు హుండీ నింపేస్తుంటే, హుండీల సంఖ్య పెంచాలా? అసలు కుబేరయ్య అకౌంట్ నెంబరు ఇస్తే - ఆన్‌లైన్‌లో ఎవరికి వారే డబ్బు ట్రాన్స్‌ఫర్ చేస్తేనే ... అప్పు త్వరగా తీరిపోతుందేమో. దేవుడి విషయంలో ఇలా మాట్లాడుతున్నానని... సారీ.... సరేనా!

మూడు రోజులు ఇట్టే గడిచిపోయాయి.

పనమ్మాయి ఈశ్వరి తిరుపతి యాత్ర నుండి వచ్చేసింది. గుండు కొట్టించింది.

దేవుడి దర్శనానికి ఇరవై గంటలు క్యూలో నుంచుని, కాళ్ళు పీకేశాయంట. తీరా దేవుడి దర్శనం అయ్యే సమయానికి, పదండి - పదండి, అంటూ నెట్టేసి... ఈడ్చేశారట..... వాళ్ళాయన వచ్చుంటే గొడవ పెట్టేసుకునేవాడట... రాకపోవటమే మంచిదయిందట... రైళ్ళో కూడా సీటు దొరక్క నిలబడి వచ్చేసరికి వొళ్ళంతా నొప్పులట... అయినా పన్లోకి రాకపోతే అమ్మగారు కోప్పడుతారని వచ్చేసిందట.

''అదేవిటి... మీ ఆయన రాకుండా. నువ్వొక్కదానివే తిరుపతి వెళ్ళటం ఏమిటి?'' అడిగింది మేడమ్.

''నాతో పాటు, నా ఇద్దరి కొడుకులు - మా చెల్లి మొత్తం నల్గురం వెళ్ళామమ్మా. మా ఆయనకు యాక్సిడెంట్ అయినప్పుడు, త్వరగా తగ్గి కోలుకుంటే కొండకొచ్చి తలనీలాలిస్తానని మ్రొక్కుకున్నాను. 'నువ్వు మ్రొక్కుకున్నావు కనకు నువ్వు వెళ్ళిరా. నేను కూడా వస్తే కూలి డబ్బులు పోతాయ్ అన్నాడమ్మా మా ఆయన. ఆయన్ది రోజుకూలీ పనికదమ్మా. అయినా, అంత మందికి ప్రయాణ ఖర్చులకు మా దగ్గర డబ్బులుండద్దమ్మా!... మా చెల్లెలు కూడా వాళ్ళాయనకు వొంట్లో బాగాలేనప్పుడు మ్రొక్కుకుందట. మేం ఎలాగు వెళ్తున్నాం కదా అని, తన ఖర్చులు తనే పెట్టుకుంటానని చెప్పి, మాతోకూడా వచ్చింది. రానుపోను ఛార్జీలు... తిండికి తీసుకెళ్ళిన డబ్బులు మొత్తం అయిపోయాయమ్మా.... తిరుగు ప్రయాణంలో కాలినడకనే కొండ దిగేశాం. వచ్చేటప్పుడు అయ్యగారిచ్చిన వంద రూపాయల్తోటే నల్గురం ఆకలి తీర్చుకున్నామమ్మా'' ఇలా మాట్లాడుతూనే తన పని తను చేసుకుపోతూ వుంది ఈశ్వరి.

ఆ మాటలు వింటున్నా నా కళ్ళు చెమ్మగిల్లాయి.

నేనిచ్చిన వంద రూపాయలు నిజంగా సద్వినియోగం జరిగినందుకు నాకు ఏడుకొండల వాడు ఇక్కడే... ఇప్పుడే ఉచిత దర్శనం ఇచ్చినంత ఆనందం కలిగింది.

నా ఫీలింగ్స్‌ను డిస్టర్బ్ చేస్తూ... ''వంద రూపాయలిచ్చాం కదా... తిరుపతి ప్రసాదం... కనీసం ఒక్క లడ్డూ ఐనా తెచ్చిందేమో చూశారా?'' అంది మేడమ్.

''చిన్న పిల్లలా ఏవిటా మాటలు'' అంటూ సున్నితంగా మందలించారు.

ప్రతిఫలాన్ని ఆశించకుండా చేసే ఏ చిన్న సహాయం ఐనా, మనకు అనిర్వచనీయమైన ఆనందానుభూతుల్ని అందిస్తుంది.

***

ఆ రాత్రి నాకెందుకో సరిగ్గా నిద్ర పట్టలేదు.

''మా ఆయన్ది రోజుకూలీ పని కదమ్మా. పన్లోకి వెళ్ళకపోతే ఆ రోజు కూలి డబ్బులు రావు కదమ్మా.... అందుకే మా ఆయన తను కొండకి రానన్నాడు' అన్న ఈశ్వరి మాటలు 'వర్క్ ఈజ్ వర్షిప్' అని ఈశ్వరి మొగుడు చెప్పకనే చెప్పాడే అనిపించింది.


భగవంతుడు ఎక్కడ లేడు? నాలో - మీలో... మనందరిలో ఈ జీవకోటిలోని ప్రతిప్రాణిలో లేడూ? కళ్ళు మూసుకుని నిశ్చల మనస్సుతో ధ్యానిస్తే కలిగే ఆ అనుభూతి... భగవంతుడు కాదూ!

సంపన్నుడు తన డబ్బు - హోదాలు ఉపయోగించి, ఉన్న చోట కాకుండా... మరెక్కడో భగవంతున్ని వెతుక్కుంటూ పోతూ, తమ ఆధిక్యతను ప్రదర్శించుకుంటుంటే, వాళ్ళను అనుసరించి, అనుకరించే పేదవాడు వాళ్ళ దారిలోనే పోతూ పడే అష్టకష్టాలు వర్ణనాతీతం.

ఏ రోజుకారోజు రెక్కాడితే కాని డొక్కాడని అనాథలు... భగవంతుని కోసం ఎక్కడెక్కడికో పోలేని కటిక దరిద్రుల కోసం, అందరివాడైన, ఆ సర్వాంతర్యామి.

''కదలిరాడ తనే గోవిందం
తన దరికిరాని జనాల కోసం''.

*





చిరునామా:
పినిశెట్టి శ్రీనివాసరావు
టి-2, బాలాజీ హైట్స్, షిరిడీ సాయిమార్గ్,
మంతెన గార్డెన్స్, జె.ఎన్.రోడ్డు,
రాజమండ్రి - 533 103